# కాశీ కావిడి

భుజం మీద కావిడి వేసుకొని కావిడిలో రెండు వైపులా బిందెలతో కాశీ నుండి తీసుకువచ్చిన గంగాజలం పెట్టుకొని ఆ బిందెలపై కాషాయి వస్త్రము కప్పి గ్రామములో ఇంటి ఇంటి దగ్గర ఆగి కాశీ కావిడి వచ్చింది అని బిగ్గరగా అందరినీ పిలచి కాశీవెళ్ళుటానికి వాళ్ళుపడ్డ బాధలు, అక్కడ దైవదర్శనం వల్ల పొందిన ఆధ్యాత్మిక అనుభూతి చుట్టూ చేరినవారికి చెప్పి అందరికి గంగాజలాన్ని తీర్థంగా ఇస్తారు. వారు ఇచ్చిన పారితోషికం తీసికొంటారు. కాశీ కావిడివారు కావిడలో ఒకవైపున శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవిల చిత్రాలను అందరికీ కనబడునట్లుగా పెట్టుకుంటారు. పూర్వకాలంలో కాశీ వెళ్ళుటకు ఇపుడున్న రవాణ సౌకర్యములు లేకపోవుటవల్ల భక్తులు నడకతోనే కాశీకి చేరుకునేవారు. అందుకనే కాశీకి వెళ్ళివచ్చినవారంటే గౌరవం మరియు కనీసం కాశీవెళ్ళలేకపోయినా కాశీకి వెళ్ళివచ్చినవారినయినా చూసి గంగాజల తీర్థాన్ని తీసికొన్నమన్న తృప్తి ఆనాటి ప్రజలలో ఉండేది. అలాగే ఆరోజులలో కాశీకి వెళ్ళి గంగాజలాన్ని తీసికొని రామేశ్వరం వెళ్ళి సముద్రజలమును తీసికొని రెండింటిని కలిపి పవిత్ర జలముగా భక్తులకు తీర్థముగా ఇచ్చేవారు. ఈ కాశీ కావిడి వేషం పగటివేషాలల్లో బహుళ ప్రచారం పొందింది. కూచిపూడి భాగవతులు ఈ పగటి వేషం వేసేవారు. బ్రాహ్మణ వేషం వేసుకొని, భుజాన కావిడి దానికి అటూఇటూ పసుపు రంగుబట్టతో మూటగట్టిన బిందెలు మరో మూటలో దేవతా పటాలు ఉంటాయి.

ఈ వేషంలో హాస్యంతో కూడిన పాటలు, మాటలు ఉంటాయి. పురుష పాత్రధారి కాశీకిపోయాను రామాహరి గంగతీర్థంబు తెచ్చాను రామాహరి, కాశీకిపోయాను రామాహరి శివుని విభూతి తెచ్చాను రామాహరి అని అంటే వారి ప్రక్కనే ఉన్న మరో స్త్రీ పాత్రధారి కాశీకిపోలేదు రామాహరి మురుగు కాల్వలో నీరండి రామాహరి, కాశీకిపోలేదు రామాహరి అది పోయిలో బూడిదండి రామాహరి.

ఈ విధంగా వ్యంగంగా పాడుతూ ప్రేక్షకులను నవ్విస్తారు.